క్లుప్తంగా

11న మండల స్థాయి క్రీడాపోటీలు

నర్వ: సీఎం కప్–24 క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామాల్లో క్రీడలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 11న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలను బుధవారం పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు ఎంపికైన ఆయా గ్రామాల క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

‘అభివృద్ధికి కృషి చేస్తా’

నర్వ: యాదవ సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని నూతనంగా ఎన్నికైన ఆ సంఘం మండలాధ్యక్షుడు మల్లేష్ అన్నారు. అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘువీర్‌యాదవ్, జిల్లా కన్వీనర్ తిరుపతయ్యయాదవ్, సదర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బల్లప్పయాదవ్, నాయకులు రాజేష్‌యాదవ్ ఈఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా ఆర్ మల్లేష్, ఉపాధ్యక్షులుగా వెంకటయ్యయాదవ్, రామచంద్రయ్యయాదవ్, శేఖర్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, సహాయకార్యదర్శులుగా నర్సిములుయాదవ్, వెంకటన్నయాదవ్, కోశాధికారిగా నరేష్‌యాదవ గౌరవాధ్యక్షులుగా చిన్న మొగిలప్పయాదవ్‌ను ఎంపిక చేశారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



ఊట్కూరు: ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బాల్‌రాం డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రిలో డా.భవానికి ఆశాకార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనాన్ని 18 వేలకు పెంచాలని కోరారు. ఆశాకార్యకర్తల సమస్యల పరిష్కారానికి మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాలమణి, లక్ష్మీ, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో హైదరాబాద్

నారాయణ పేట టౌన్: ఆశావర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు బాలమణి తెలిపారు. సోమవారం నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులకు ఆమె వినతి పత్రం అందజేశారు.

పద్మనాభ స్వామికి అభిషేకాలు

నారాయణపేట టౌన్: పట్టణంలోని పళ్ల వీధిలో గల పద్మనాభ స్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం పద్మనాభ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, గోపూజ, భూతరాజ పూజ, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీఆదిరాజ మఠం పీఠాధిపతి శ్రీ విశ్వ వల్లభ తీర్థ శ్రీపాదులు శ్రీమద్భాగవత పారాయణం చేశారు. అష్టాదశ పురాణాల్లో కెల్ల శ్రేష్టమైనది శ్రీమద్భాగవతపు రాణం అని, ఇది విన్న భక్తుల అభీష్టాలు, ఈత బాధలు తొలుగుతాయని స్వామిజీ ప్రవచించారు. కార్యక్రమంలో మహిళ భక్తులు, పురోహితులు పాల్గొన్నారు. ఈ నెల14వ తేదీ వరకు ప్రతిరోజు సాయంకాలం శ్రీమద్భాగవత పారాయణం కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు శ్రీపాద కులకర్ణి తెలిపారు.

వేంకటేశ్వస్వామి జాతరకు సర్వం సిద్ధం

- ముస్తాబైన ఆలయం
- 13నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- తరలిరానున్న వివిధ జిల్లాల భక్తులు



రంగులు వేస్తున్న కార్మికులు



వేడుకలకు సిద్ధం చేసిన కడపరాయుడి దేవాలయం

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో వెలిసిన కడప రాయ వేంకటేశ్వర స్వామి జాతరకు కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామివారి వేడుకలు కొనసాగుతాయని వారు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా స్వామివారిని భక్తులు కొలుస్తుంటారు. ఇక్కడ ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలివస్తారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఉత్సవాల్లో తాగునీటి కొరతను తీర్చేందుకు ప్రస్తుతం మూడు బోర్లను ఉపయోగిస్తామన్నారు. భక్తులు బసచేసేందుకు గుట్టను చదును చేసి శుభ్రం చేసినట్లు పూజారి నాగరాజు తెలిపారు. గ్రామస్తులందరూ ఏకమై నిధులు సేకరించి దేవాలయానికి కొత్త శోభ తెచ్చారు. దాతల సహకారంతో వంట గదిని సైతం నిర్మించారు.

కడప నుంచి వచ్చి ఇక్కడ కొలువైన..

కడపరాయుడు దేవాలయానికి మూడు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. వేంకటేశ్వర స్వామి భక్తుల కోరిక మేరకు కడప జిల్లా నుంచి ఇక్కడ వచ్చి కొలువయ్యారు. దీంతో స్వామివారికి కడపరాయుడు అని పేరు వచ్చిందని గ్రామస్తులు చెబుతుంటారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారాయణపేట: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సత్యనారాయణచౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మాట్లాడారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న ఆదిత్యపరాశ్రీ

ఊట్కూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆదిత్య పరాశ్రీ అన్నారు. సోమవారం బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలో ఆధిత్యపరాశ్రీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, అలంకరణ, పడిపూజ, మహా మంగళహారతి, భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారులు దీక్షలోని నియయాలను నిష్ఠతో పాటించడంతో దైవభక్తి పెరగడంతో పాటు ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందన్నారు. పాశ్చాత్య సంస్కృతి వల్ల యువత పెడదారి పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు రఘువీర్, భీమయ్య, విజయ్‌కుమార్, భానుచందర్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో ట్రైనీ కలెక్టర్ గరిమానూరుల్లా

ట్రైనీ కలెక్టర్ గరిమానూరుల్లా

మక్తల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ట్రైనీ కలెక్టర్ గరిమానూరుల్లా అన్నారు. సోమవారం సీఎం కప్ క్రీడా పోటీల సందర్భంగా మక్తల్ పట్టణంలో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. మక్తల్ నుంచి అధికంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక కావడంపై విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ బోగేశ్వర్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంఈఓ అనిల్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గోపాలం పాల్గొన్నారు.

నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం



జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన గొర్రెల కాపరుల సంఘం నాయకులు

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకం దారుల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కన్వీనర్ కనకప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ బేన్ షలంకు గొర్ల కాపరుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయలేదని, ఈ ప్రభుత్వం డీడీలు వాపస్ ఇచ్చిందన్నారు. 50 ఏళ్లు నిండిన గొర్లకాపరులకు రూ.5 వేల పెంఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గొర్ల మేకల పెంపకం దారుల సంఘం నాయకులు మహేశ్, సంతోష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలప్ప,రైతుసంఘం నాయకులు నర్షిములు, రాములు,హన్మంతు,వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

మక్తల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణదారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా కొనసాగుతోందన్నారు. ఈవిషయం మార్కెట్ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దీక్ష విరమణ



కొత్తపల్లి: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి స్పష్టమైన హామీని ఇవ్వడంతో భూనీడు గ్రామస్తులు సోమవారం దీక్ష విరమించారు. మండలంలో నిర్మించుటకు మంజూరైన కొన్ని భవనాలను భూనీడులో నిర్మించాలని వారం రోజులుగా ఆ గ్రామస్తులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం మన గ్రామానికి కావాలసిన కార్యాలయాల నిర్మాణాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దీంతో నిరసన దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు, గ్రామస్తులు దీక్షను విరమించుకున్నారు.

నేడు మారెమవ్వ బోనాలు

మాగనూర్: మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో వెలసిన శ్రీబయటి మారెమవ్వ బోనాలు మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం పంట కోతలు ముగించి ధ్యానం ఇంటికి చేరాక డిసెంబర్‌లో ఈబోనాలు నిర్వహించుకోవడం ఇక్కడి సంప్రదాయం అని అన్నారు. ఈ బోనాలకు మండల ప్రజలతో పాటు ముంబై, హైదరాబాద్, బెంగుళూర్ లాంటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని తెలిపారు. .

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నారాయణపేట: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. సోమవారం శ్రీపాద పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సమావేశమైన పిరమిడ్ మాస్టర్లు ఐక్యరాజ్యసమితికి కృతజ్ఞతా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 21న ధ్యాన దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. గౌతమ బుద్ధుడి నుంచి ప్రసిద్ధి పొందిన ధ్యానాన్ని అంతర్జాతీయంగా ధ్యాన దినోత్సవాన్ని జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. డిసెంబర్ 21న ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ధ్యాన దినోత్సవం జరుపుకోవాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. పిరమిడ్ సంస్థ సభ్యులు నరేష్, రవికుమార్, మాణిక్యప్ప, గోవిందు, శేఖర్, వెంకటేష్, సరితలు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

మరికల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లో తల్లపెట్టిన ధర్నాకు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. సొంత పూచీకత్తుపై సాయంత్రం వారిని వదిలిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోపి, ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో సోమవారం 7 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కాలప్ప తెలిపారు. గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి గ్రామంలో పీడీఎఫ్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచాడు. పలువురు గ్రామస్తులు సమాచారమివ్వగా బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాల పరిశీలన



కాలువల పక్కన ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

కోస్గి: మున్సిపల్ పరిధిలో చెరువు కాలువలు, కుంటల పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను సోమవారం ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు పరిశీలించారు. పట్టణంలో ఉన్న ఎర్రకుంట, పాలబావి, లద్దిమడుగు నీటి వనరుల పరిధిలో హద్దులను గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలు, ఆక్రమణలను గుర్తించిన ఇరిగేషన్ అధికారులు మున్సిపల్ శాఖకు సమగ్ర వివరాలు అందజేశారు. ఇరిగేషన్ డీఈ ఆనంద్ కిషోర్, ఏఈ నిర్మల, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బల్‌రాం, టీపీఓ విశాల్ ఉన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు
- పట్టణంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కోస్గి: ఎన్నికల వేళ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పుర వీదుల గుండా కొనసాగిన ర్యాలీ స్థానిక శివాజీ చౌరస్తా వరకు చేపట్టారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సిములు అధ్యక్షతన నిర్వహించిన ఈ ర్యాలీకి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పాలనలో ఆరు అబద్ధాలు, 66 మోసాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కోటకొండ రాము, నాయకులు బంటు రమేష్, ప్రతాప్‌రెడ్డి, నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ ముకుందు, ఓబీసీ కన్వీనర్ నరేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీ, మండలాల అధ్యక్షులు శ్రీకాంత్, నర్సిములు, సతీష్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మరికల్: ఇందిరమ్మ ఇళ్లపథకానికి సంబంధించిన సర్వేలో పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని సోమవారం ఎంపీడీఓ కొండన్నకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అప్పగించిన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. మళ్లీ కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అప్పగించడంతో పనిభారం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువు కబ్జా ఆపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రోనిపల్లి గ్రామస్తులు

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి గ్రామంలో ఉన్న ఊరచెరువును కబ్జా చేసి వరిసాగుకు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీన్ని ఆపాలంటూ సోమవారం తహసీల్దార్ సింధుజాకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గతంలోనూ కబ్జా చేస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కబ్జాను నిలిపివేశారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు పంటలు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు బాలరాజు, కృష్ణయ్య, ఆంజనేయులు, తిమ్మయ్య, అంజప్ప, హన్మంతు, రామాంజనేయులు ఉన్నారు

ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే ప్రారంభం



ఓబ్లాపూర్ గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

మాగనూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి సోమవారం సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ రహ్మాతుద్దీన్ తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 7172 ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలంలోని ఓబ్లాపూర్, పర్శకదొడ్డి గ్రామాల్లో ఎంపీడీఓ కార్యాలయం సర్వే చేశారని తెలిపారు. అర్హులను గుర్తించి పై అధికారులకు నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



అయోధ్యలో నృత్య ప్రదర్శ చేస్తున్న మక్తల్ విద్యార్థినులు

మక్తల్: ప్రముఖ పుణ్యక్షేత్రం, శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో మక్తల్‌కు చెందిన ఆద్యనృత్యాలయ విద్యార్థినులు సుప్తశ్రీ రెడ్డి, కీర్తి, ఆద్య, హసీని, అనన్య, శరణ్య, అక్షిత, ఆర్వి నృత్యప్రదర్శన చేశారు. సోమవారం ఈ విద్యార్థినులను గ్రామస్తులు అభినందించారు. అక్కడ నృత్యం చేసి మక్తల్‌కు అయోధ్యలో గుర్తింపు వచ్చేలా చేశారన్నారు. గురువులు హారతిజ్యోతి, గోపాల్‌రావు పర్యవేక్షణలో ఈకార్యక్రమం చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పసుల రంజిత్‌రెడ్డి, మానస, దినేస్, వాణి, నాధ, సవిత, అరుణ, అలేఖ్య, స్వాతి, అంజనేయులు, మన్యం, రాజశేఖర్, మహేశ్వరి, తులసి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించిన రాజ్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట: పేద విద్యార్థులను ఆదుకొని వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతామని భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకటమ్మ, అశోక్ దంపతుల కుమార్తె బీటెక్ ఫైనలియర్ చదువుతున్న సింధుజకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకోవాలనే తపన ఉండి పేదరికంతో చదువుకు దూరం అవుతున్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ చేయూతనిస్తుందని తెలిపారు. భీష్మరాజ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సింధూజ పేర్కొన్నారు.ఫౌండేషన్‌సభ్యులు తిప్పన్న, గోపాల్, కృష్ణ, సుదర్శన్ రెడ్డి, వెంకటేష్, శివరాజ్, శ్రీనివాస్, నర్సింహ, సంతోష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మక్తల్: పట్టణంలో ఎంపీపీఎస్ (ఎస్‌సి వాడ) పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీ, పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాసురావు, గోపాల్ , వనజ, అనితను శాలువాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం హెచ్‌ఎం కన్యాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు బాలరాజు, వివేకానంద, కౌన్సిలర్ చీరాల సత్యనారాయణ, రాం మాదవ్, మామిళ్ల కిష్టప్ప, తిరుపతి నర్సిములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

- కేక్‌లు కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



మక్తల్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



నర్వ అంబేడ్కర్ చౌరస్తాలో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కృష్ణా: టైరోడ్డులో నిర్వహిస్తున్న సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్ చేశారు. పలుచోట్ల రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.